క్లుప్తంగా

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



వెంకట్‌ను సన్మానిస్తున్న నాయకులు

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్‌గా నియమితులైన యువ నాయకుడు వెంకట్‌ను గురువారం దళిత, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. పేర్కంపల్లికి చెందిన వెంకట్ రైతు కుటుంబానికి చెందినవాడు. వెంకట్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినవారికి ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు, మద్దతు ధర, దళారుల ప్రమేయం లేకుండా పంట విక్రయం వంటి విషయాల్లో తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. వెంకట్‌ను సన్మానించిన వారిలో దళిత సంఘాల నాయకులు మల్కయ్య, బుగ్గప్ప, మాజీ డైరెక్టర్ ఆశన్న, ఉప సర్పంచ్ నర్సింహులు, శేఖర్, హాజీపూర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

ఎంపీపీ మల్లేశం



క్రీడా కిట్ అందజేస్తున్న ఎంపీపీ మల్లేశం

పూడూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ మల్లేశం అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీలకు క్రీడా ప్రాంగణంలో ఆడేందుకు క్రీడా కిట్‌లను అందజేశారు. గ్రామాల్లోని చిన్నారులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పొందేలా ప్రోత్సాహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ సుందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు

బంట్వారం: మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేసిన బంట్వారం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిదాస్, నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. డీసీఎం వ్యాన్‌లో ఎక్కించి బంట్వారం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రజలే బుద్ధి చెబుతారు..

మోమిన్‌పేట: బీఆర్ఎస్ బహిరంగ సభను అడ్డుకునేందుకు యత్నించిన ప్రతిపక్ష పార్టీల నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు మోమిన్‌పేటలోని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టులతో తమగొంతును నొక్కలేరని నేతలు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సిరాజుద్దీన్, లక్ష్మారెడ్డి, క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

కేఎల్ఆర్‌కే టికెట్ ఇవ్వాలి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ తాండూరు టికెట్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)కే ఇవ్వాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్ కోరారు. పెద్దేముల్, తాండూరు మండలాల బూత్ కమిటీ సభ్యులకు గురువారం పట్టణంలోని వైట్ ప్యాలెస్‌లో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ.. తాండూరులో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. కార్యకర్తల కోరిక మేరకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కేఎల్ఆర్‌కే ఇవ్వాలని తీర్మాణం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చా ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్, ఉత్తమ్‌చంద్, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- మున్సిపాలిటీలో చెత్తసేకరణకు ఆటోలు, కార్మికుల కొరత
- 2–3 రోజులకు ఒక్కసారి చెత్త సేకరణ
- తడి, పొడి అంతా కలిపి సేకరిస్తున్న కార్మికులు



చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదంటూ పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. చెత్త తీసుకెళ్లేందుకు రోజూ వార్డుల్లోని ఇళ్లకు రావాల్సిన ఆటోలు 2–3 రోజులకు ఒకసారి కూడా సరిగా రావడం లేదు. దీంతో ఆయా వార్డుల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 34 వార్డులు ఉండగా అందుకు సరిపడా చెత్త సేకరణ వాహనాలు, పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం కూడా ఒక కారణం అని పట్టణ ప్రజలు అంటున్నారు. పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతున్నా పారిశుద్ధ్య రంగంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో పాలకవర్గం విఫలమవుతుందనే విమర్శలు ఉన్నాయి.

చెత్త సేకరణకు ఇబ్బందులు

వికారాబాద్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు వాహనాల కొరత ఉంది. 34 వార్డుల్లో రోజుకు సుమారు 35 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. ప్రస్తుతం చెత్త సేకరించేందుకు కేవలం 23 ఆటోలు, 4 ట్రాక్టర్లు ఉన్నాయి. ఈ నాలుగు ట్రాక్టర్లు ప్రధాన రోడ్ల వెంట చెత్త సేకరించడంతో పాటు, మున్సిపాలిటీలో రోజూ జరిగే ఆయా కార్యక్రమాలకే సరిపోతాయి. ఇక 23 ఆటోలు మాత్రమే 34 వార్డుల్లో చెత్త సేకరణ చేపట్టాలి. ఒక ఆటో రెండు వార్డుల్లో చెత్త సేకరించాలంటే ఒక ఇంటికి నాలుగు రోజులకు ఒకసారి ఆటో వస్తుంది. ఈ 23 ఆటోల్లో కూడా ప్రతిరోజు రెండు–మూడు ఆటోలు చెడిపోతుండటంతో పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

సకాలంలో ఆటోలు రాకపోవడంతో చాలామంది చెత్తను ఆరుబయటనే పారవేస్తున్నారు. శివారు వార్డుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. శివారు వార్డులకు కనీసం చెత్త సేకరణ ఆటోలు వెళ్లకపోగా, పారిశుద్ధ్య సిబ్బంది కూడా అటువైపు తొంగి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

తడి–పొడి అంతా ఒకచోటే..

మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాల కొరతతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతుంది. వాహనాల కొరత కారణంగా తడి, పొడి చెత్త అంటూ వేర్వేరుగా కాకుండా అంతా ఒకే వాహనంలో వేసి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఫలితంగా వ్యర్థానికి అర్థం లేకుండాపోతోంది. కొందరు తడి,పొడి చెత్తను వేరుచేసి ఇస్తున్నా పారిశుద్ధ్య సిబ్బంది ఆటోలో ఒకేచోట వేసుకొని పోతున్నారు.

కార్మికుల కొరతా కారణమే

34 వార్డులు దాదాపు 85వేల జనాభ ఉన్న వికారాబాద్ పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం పారిశుద్ధ్య విభాగంలో 163 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ సంఖ్య ఏమాత్రం సరిపోదనేది అధికారుల అభిప్రాయం. మున్సిపాలిటీలో విలీనమైన వార్డులు ప్రధాన పట్టణానికి దూరంగా ఉండటంతో కార్మికులు విలీన గ్రామాలకు వెళ్లి రావడానికే సమయం పడుతుంది. ప్రధాన పట్టణానికి విలీన గ్రామాలు 3 నుంచి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడి స్థానికులనే కార్మికులుగా పెట్టుకుంటే కొంత సమస్య తీరే అవకాశం ఉంది.

ప్రతిరోజు చెత్త సేకరించాలి



మా కాలనీలో రోడ్లు బాగాలేని కారణంగా చెత్త ఆటోలు ఇంటివరకు రావడం లేదు. 2–3 రోజులకు ఒకసారి ఆటో వస్తోంది. దీంతో వ్యర్థాలు నిలువ ఉండటంతో పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. కొన్నిసార్లు వారం రోజులైనా చెత్త బండి రావడం లేదు. వాహనాల సంఖ్య పెంచితే బావుంటుంది. ప్రతిరోజు చెత్త సేకరణ ఆటో వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వీరయ్య, మధు కాలనీ, వికారాబాద్

ఆడపడుచుల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



బషీరాబాద్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: ఆడపడుచుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరున అమలుచేయడం జరుగుతుందని అన్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలో గురువారం మహిళలకు బతుకమ్మ చీరలను, లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, బీసీ బంధు చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్‌కు ముస్లిం మహిళలకు, క్రిస్మస్‌కు క్రైస్తవ మహిళలకు, బతుకమ్మ పండుగను కులమతాలకు అతీతంగా ప్రభుత్వం చీరల పంపిణీ చేస్తుందన్నారు. తాండూరు నియోజకవర్గంలో లక్షమందికిపైగా లబ్ధిదారులకు చీరలను అందజేయనున్నట్లు తెలిపారు. స్వరాష్ట్రంలో మన పండుగలకు, మన సంస్కృతి సాంప్రదాయాలను గుర్తించి అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బీసీ కులవృత్తుదారులకు బీసీ బంధు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్‌లు ప్రియాంక, శాంతిబాయి, పద్మ, సునీత, దశరథ్, వెంకటయ్య, విష్ణు, ఎంపీటీసీలు శ్రీనివాస్, సురేష్, అధికారులు పాల్గొన్నారు.

నాన్ లోకల్‌ను తరిమేద్దాం

తాండూరు రూరల్: 'నేను మీ తాండూరు బిడ్డను.. నన్ను మరోసారి ఆశీర్వదించండి' అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని గౌతపూర్‌లో గురువారం ఆయన క్రీడా సామగ్రి, బీసీ బంధు, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరులో తాజాగా నాన్‌లోకల్ లీడర్లు వచ్చి పోటీచేయాలని చూస్తున్నారని తెలిపారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వారిని తరిమేయాలన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే తాండూరు రూపురేఖలు మారుస్తానని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వీణా, వైస్ చైర్మన్ ఉమాశంకర్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపారెడ్డి, సర్పంచ్ రాజప్పగౌడ్,నాయకులు రాంలింగారెడ్డి, రాజుగౌడ్, నారాయణరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రావణ్, నాయకులు

పెద్దేముల్: బీఆర్ఎస్ నేత నారాయణరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంబాపూర్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి యువజన సంఘం సభ్యులు గురువారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, ఉప సర్పంచ్ వెంకటయ్య, నాగేందర్, విద్యా కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోజంతా ఉచిత ప్రయాణం

బీఆర్ఎస్ సీనియర్ నేత, పెద్దేములమండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి పుట్టినరోజును గురువారం పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మంబాపూర్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి వీరాభిమాని రత్నం.. ఆయన బర్త్‌డే సందర్భంగా ఒకరోజు మొత్తం మంబాపూర్ నుంచి తాండూరు వరకు ఉచితంగా ప్రయాణికులను చేరవేశాడు.

కేటీఆర్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు



ధారూరు: సభకు తరలుతున్న నాయకులు



మోమిన్‌పేట: ర్యాలీని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ధారూరు: వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన బీఆర్ఎస్ నివేదన బహిరంగ సభకు ధారూరు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఆధ్వర్యంలో కార్లు, బైక్‌లపై నాయకులు సభాస్థలికి తరలివెళ్లారు.

మోమిన్‌పేట నుంచి..

మోమిన్‌పేట: బీఆర్ఎస్ నివేదన సభకు మోమిన్‌పేట మండలం నుంచి గురువారం ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో వాహనాలలో భారీగా తరలివెళ్లారు. టేకులపల్లి గ్రామం నుంచి పార్టీ శ్రేణుల వాహనాలను పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జై కేసీఆర్, జై బీఆర్ఎస్ అంటూ నినదించారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందన్నారు. దేశంలో ఆడపడుచులు పూల పండుగ చేసుకునేది కేవలం తెలంగాణలోనే అని అన్నారు. అందు కోసం ప్రతి ఆడపడుచు కొత్త చీరలు కట్టుకుని బతుకమ్మ ఆటలు ఆడాలని ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధిచేస్తున్నారన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రవీందర్, వెంకటేష్, కిరణ్, మునీర్, నాగేశ్వర్, రవి కుమార్, మీర్ తహేర్, మౌలాన పాల్గొన్నారు.

గురువులు నవసమాజ నిర్మాతలు



ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు

ఎంపీపీ అనితాగౌడ్

తాండూరు రూరల్: గురువులు నవసమాజ నిర్మాతలని ఎంపీపీ అనితాగౌడ్, జెడ్పీటీసీ మంజుల అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ వృత్తిని బరువుగా కాకుండా బాధ్యతగా భావించి ముందుకెళ్లాలని కోరారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. పాఠశాలల్లో భావిభారత పౌరులను తయారు చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానికులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి: బీజేపీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నగర వాసులకు కేటాయించడం సరికాదన్నారు. ఇళ్ల పంపిణీ విషయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఎమ్మెల్యే, స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నిల్లో శంకర్‌పల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇప్పిస్తామని చెప్పారని..మళ్లీ ఏ విధంగా ఓట్లను అడిగేందకు వస్తారని మడిపడ్డారు. చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం





కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: వికారాబాద్ పర్యటనకు వచ్చిన కేటీఆర్‌కు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యేలు.. డాక్టర్ మెతుకు ఆనంద్, యాదయ్య, మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు ఆయనకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

తండాలకు స్వచ్ఛమైన తాగునీరు

- పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: తండాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిచేందుకు పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తుందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పాల్కొని గుట్టతండా, శ్యాంరావుతండాల్లో వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీని గెలిపిస్తేనే తండాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం కొత్తపేటలో యువతకు హెల్మెట్లను అందజేశారు. సంతాపూర్ గ్రామంలో ఇటీవల శ్రీకాంత్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేలు, పోమాల్‌పల్లిలో కృష్ణయ్య మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు, తొమ్మిదిరేకుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులకు రూ.5వేలు, ప్రమాదంలో గాయపడిన శ్రీశైలంకు ఆస్పత్రి ఖర్చులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. సంతాపూర్ సర్పంచ్ అంజయ్య, మోహన్‌సింగ్, నరేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థులెవరో..?

హాట్ సీట్‌గా తాండూరు అసెంబ్లీ స్థానం

- జాతీయ పార్టీల అభ్యర్థుల ప్రకటనలో జాప్యం
- ఆశావహుల్లో మొదలైన కలవరం
- ప్రచారంలో దూసుకెళ్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్

తాండూరు: అసెంబ్లీ ఎన్నికలకు వారం రోజుల్లో షెడ్యూల్ జారీ కానుంది. అయితే ఇప్పటివరకు ప్రధాన జాతీయ పార్టీలేవీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటించి జిల్లాలో ఎన్నికల వాతావరణం సృష్టించింది. అధికార పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రధాన పార్టీల నుంచి ప్రత్యర్థులు ఎవరనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

హాట్ సీట్‌గా తాండూరు..

జిల్లాలో తాండూరు అసెంబ్లీ రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి టికెట్ ఖరారైంది. నియోజకవర్గంలో బలమైన కేడర్‌తో పైలెట్ ఎన్నికల రేసులో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు రేసులో వెనుకబడినట్లు కన్పిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నెలరోజుల క్రితం వరకు తాండూరు ఎమ్మెల్యే టికెట్ రమేష్ మహరాజ్‌కే వస్తుందని అంతా భావించారు. అయితే ఇటీవల రమేష్ మహరాజ్ ఎన్నికల రేసులో నుంచి తప్పుకొని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పేరును తెరపైకి తీసుకొచ్చారు. మరోవైపు తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత భర్త డాక్టర్ సంపత్‌కుమార్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నేడో, రేపో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంటనే ఆ పార్టీ అభ్యర్థిగా తాండూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు ఒప్పందం కుదిరిందని సమాచారం.

మరోపక్క కాంగ్రెస్ పార్టీ నుంచి 10 మంది నాయకులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేస్తారా.. లేకా పార్టీలో చేరుతున్న కొత్తవారికి అవకాశం కల్పిస్తారా అనే చర్చ జోరుగా సాగుతోంది. తాండూరు అసెంబ్లీ టికెట్‌పై హామీ లభించడంతోనే మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారని టాక్ నడుస్తోంది. అయితే మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌తో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యే టికెట్ రేసులో ముందంజలో ఉన్నారు. మరోవైపు బీసీ వర్గాలకు తాండూరు టికెట్ ఇస్తే డాక్టర్ సంపత్‌కుమార్‌కు హస్తం గుర్తు వరించే అవకాశాలు లేకపోలేదు. మొత్తానికి నియోజకవర్గంలో ఎన్నికల సందడి నెలకొంది.

బీజేపీలో కనిపించని సందడి

తాండూరు అసెంబ్లీ పరిధిలో బీజేపీలో ఎన్నికల సందడి కనిపించడం లేదు. కేవలం జాతీయస్థాయి నాయకుల సభలకు, ఇతర ప్రాంతాలకు ప్రజలను తరలించేందుకు తప్ప తాండూరు నియోజవకర్గంలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టలేదు. ప్రధానంగా బీజేపీ టికెట్ ఆశిస్తున్న వారిలో మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేష్ మహరాజ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, మరో ఇద్దరు నేతలు ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసిన పటేల్ రవిశంకర్‌కు మరోసారి ఛాన్స్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు టాక్. స్థానిక నేతలను కాదని వలస నేతలకు టికెట్ కేటాయించే అవకాశాలు సైతం కనిపిస్తున్నాయి.

కమ్మేసిన పొగమంచు

మండలంలో రెండు రోజుల నుంచి పొగమంచు పంట పొలాలను కమ్మేస్తోంది. గురువారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పొగమంచుతో పంట పొలాలు పూర్తిగా పాడవుతున్నాయి. పత్తిగూడ రాలటం, కంది పంటలకు పురుగు పెరగటంతో రైతన్నలు లబోదిబో మంటున్నారు. తాండూరు–సంగారెడ్డి, తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారులపై ఉదయం పూట పొగమంచు కమ్మేయడంతో లారీలను, వాహనాలను పక్కన పెట్టి మంచు తగ్గిన తర్వాత వెళ్లాల్సిన పరిస్థితి.

– పెద్దేముల్

